
ANDHRAJYOTHY
# ఆంధ్రజ్యోతి
సిద్దిపేట
5
శనివారం 2 ఆగస్టు 2025





పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

## వైద్య సేవలపై నమ్మకం పెంచాలి

- డీఎంహెచ్‌వో ధనరాజ్

నంగునూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవలపై ప్రజలకు నమ్మకం కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం నంగునూరు మండలం రాజగోపాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. రోగులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలన్నారు. గర్భిణులు, పిల్లలకు అందించాల్సిన వ్యాధినిరోధక టీకాలను సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో ప్రస్తుత వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అవగాహన పెంచాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని మెడికల్ స్టోర్, ల్యాబ్, ఓపీ, సిబ్బంది హాజరు శాతాన్ని పరిశీలించారు. డీఎంహెచ్‌వో వెంట ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్ యాదవ్, డాక్టర్ సరిత, హెచ్‌ఈవో స్వామి, మహిళా సూపర్‌వైజర్ అనురాధ, వైద్య సిబ్బంది ఉన్నారు.



## వివాహ ఆహ్వానం

టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి, టీజీ ఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి దంపతుల కుమార్తె జయారెడ్డి వివాహం హైదరాబాద్‌కు చెందిన గుణ చైతన్యరెడ్డితో ఈ నెల 7న సంగారెడ్డిలో జరగనుంది. ఈ వివాహ వేడుకలకు హాజరు కావాలని ఆంధ్రజ్యోతి, ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణకు శుక్రవారం సంప్రదాయ పద్ధతిలో ఆహ్వాన పత్రిక అందజేస్తున్న జగ్గారెడ్డి దంపతులు

-(సంగారెడ్డి, ఆంధ్రజ్యోతి)





జనహిత యాత్రలో అభివాదం చేస్తున్న కాంగ్రెస్ నేతలు, మంత్రులు

# జనహిత జోష్

- ఉత్సాహంగా కాంగ్రెస్ పాదయాత్ర
- తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు
- అడుగడుగునా జన నీరాజనం
- దామోదర్‌పై మహేశ్, మీనాక్షి, జగ్గారెడ్డి ప్రశంసలు
- నియోజకవర్గ అభివృద్ధిని చూసి అబ్బురం

టీపీసీసీ ఆధ్వర్యంలో చేపట్టిన జనహిత పాదయాత్ర అందోలు నియోజకవర్గంలో శుక్రవారం జోర్దార్‌గా సాగింది. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు మండలంలోని సంగుపేట చౌరస్తా వద్ద మంత్రి దామోదర్ రాజనర్సింహ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్, మరో మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతం పలికారు. అక్కడి నుంచి పాదయాత్ర ప్రారంభించి అందోలు శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, నర్సింగ్ కళాశాలల్లో విద్యార్థినులను కలిశారు. అందోలులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి జోగిపేటకు చేరుకుని బసవేశ్వర విగ్రహానికి పూలమాలలువేసి హనుమాన్ మందిర్ చౌరస్తా వద్దకు చేరుకున్నారు. దారిపొడుగునా కాంగ్రెస్ శ్రేణులు నినాదాలు, కేరింతలతో వెంట నడిచారు.

-జోగిపేట/జోగిపేట రూరల్, (ఆంధ్రజ్యోతి)

### మతం కాదు.. మానవత్వమే కాంగ్రెస్ సిద్ధాంతం : మంత్రి దామోదర్

మతం, కులం కాదు.. మానవత్వమే కాంగ్రెస్ సిద్ధాంతమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. మతాన్ని అంతర్గతంగానే ఉంచుతూ ప్రజల బాగోగులే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. పదేళ్లుగా తెలంగాణను బీఆర్‌ఎస్ దోచుకున్నదని ఆరోపించారు. గత 40 ఏళ్లుగా తమ కుటుంబం గెలుపోటములకు అతీతంగా అందోలు నియోజకవర్గంలో ఉందని, ఇది తన కుటుంబానికి దక్కిన గౌరవమని పేర్కొన్నారు. తాను గెలిచి మంత్రిగా చేసిన ప్రతీసారి ఆయా శాఖల పరిధిలో నియోజకవర్గంలో రూ.వేల కోట్ల అభివృద్ధి పనులు చేపట్టానని చెప్పారు. గతంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో అందోలును ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దానని చెప్పారు. ఈసారి వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నాని చెప్పారు.



### హామీలన్నింటినీ నెరవేరుస్తున్నాం

జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలనన్నింటినీ సీఎం రేవంత్ ఆధ్వర్యంలోని తమ ప్రభుత్వం నెరవేరుస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రానికి 17 లక్షల ఇందిరమ్మ ఇళ్లను ఇచ్చిన కాంగ్రెస్ సర్కారుదేనన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ అధికారంలో ఉన్నా లేకున్నా కాంగ్రెస్ పార్టీకి ప్రజల సంక్షేమమే ప్రాధాన్యమని అన్నారు. రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లో రూ. 9వేల కోట్లు రైతుల ఖాతాలో జమ చేశామని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అంటే ప్రజల కోసం

మిగతా 7వ పేజీలో

# 'ఇందిరమ్మ ఇళ్ల'కు ఆవాస్ ప్లస్ రీసర్వే

- రెండు రోజుల్లో 75 వేల లబ్ధిదారులను రీ సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశం
- రేపటితో ముగియనున్న గడువు
- గ్రామ కార్యదర్శులకు పెరిగిన పనిభారం
- లబ్ధిదారుల వివరాల నమోదుకు పరుగులు



దుబ్బాక, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గత డిసెంబరులో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో జిల్లాలో అర్హులుగా గుర్తించిన 75,900మంది వివరాలను ఆగస్టు 3లోగా ఆవాస్ ప్లస్ యాప్‌లో నమోదు చేయాలి. ఆవాస్ యాప్‌లో నమోదైన వారికే ఐదేళ్ల ప్రణాళికలో భాగంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద నిధులు మంజూరవుతాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గత బుధవారం రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్ ద్వారా జిల్లా కలెక్టర్లకు ఈ ఆదేశాలు జారీ చేయగా, శుక్రవారం గ్రామ కార్యదర్శులకు, ఎంపీడీవోలకు ఈ సమాచారం అందింది. దీంతో కేవలం రెండు రోజుల్లో లబ్ధిదారుల వివరాలు నమోదు చేయడం గ్రామ కార్యదర్శులకు సవాల్‌గా మారింది.

### ఇందిరమ్మ సర్వేలో మూడు విభాగాలు

గతంలో నిర్వహించిన ఇందిరమ్మ సర్వేలో మూడు విభాగాలుగా లబ్ధిదారులను వర్గీకరించారు. ఎల్1: గుడిసెలు, రేకుల ఇళ్లు, పెంకుటిళ్లలో నివాసముంటూ, గతంలో గృహనిర్మాణ పథకాల ద్వారా లబ్ధి పొందని వారు. ఈ విభాగంలో జిల్లాలో 75,900 మంది అర్హులుగా గుర్తించారు. రెండో విభాగంలో ఎల్2: ఇల్లు కట్టుకోవడానికి సొంత స్థలం లేనివారు. ఎల్ 3: దరఖాస్తు చేసుకున్న వారిలో అనర్హులు. అయితే ప్రస్తుతం ఎల్ 1 జాబితాలో ఉన్న 75,900 మంది లబ్ధిదారుల వివరాలను ఆవాస్ యాప్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం లబ్ధిదారులకు రూ.72వేలు, అలాగే మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12 వేలు అందిస్తుంది. మిగిలిన నిధులను, సుమారు రూ.4.16లక్షలు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. ఇంటి నిర్మాణ విస్తీర్ణాన్ని కేంద్రం 360 చదరపు అడుగులకు పరిమితం చేయగా, రాష్ట్ర ప్రభుత్వం అదనంగా 36 ఫీట్లకు పెంచింది. ఆ తర్వాత 400 నుంచి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకోవడానికి అనుమతించింది.

> ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మరోసారి సర్వే తప్పనిసరి అయ్యింది. కేంద్ర ప్రభుత్వం ఇందిరమ్మ సర్వేను పరిగణనలోకి తీసుకోకపోవడంతో, ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద నిధులు పొందేందుకు లబ్ధిదారుల వివరాలను 'ఆవాస్ ప్లస్' యాప్‌లో నమోదు చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ నిర్ణయించింది. ఈ మేరకు రెండు రోజుల్లో 75 వేల మంది లబ్ధిదారుల వివరాలను తిరిగి నమోదు చేయాలనే ఆదేశాలు గ్రామ కార్యదర్శులకు పెద్ద సవాల్‌గా మారాయి. ఈ ప్రక్రియలో లొకేషన్, లబ్ధిదారుల ఆధార్ కార్డులు, కుటుంబ సభ్యుల వివరాలు, ముఖచిత్రం వంటివి నమోదు చేయాల్సి రావడంతో గ్రామ కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### సాంకేతిక సమస్యలు..

గతంలో ఇందిరమ్మ సర్వేలో ఒక లబ్ధిదారుడి వివరాలు నమోదు చేయడానికి 20 నిమిషాల నుంచి గంట సమయం పట్టేది. ఇప్పుడు ఆవాస్ ప్లస్ యాప్‌లో తప్పనిసరిగా లోకేషన్‌కు వెళ్లి వివరాలు నమోదు చేయాలి. ఈ ప్రక్రియలో లబ్ధిదారుడి ఆధార్ కార్డు, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు, అలాగే ముఖ చిత్రాన్ని ఫేస్ యాప్ ద్వారా తీసుకోవాలి. చాలా సందర్భాల్లో ముఖ చిత్రాన్ని తీసుకోడానికి గంట సమయం

మిగతా 8వ పేజీలో

### కొండపాక ఐవోసీని తనిఖీ చేసిన కలెక్టర్

- భూభారతి, ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియ పరిశీలన



కొండపాక : ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

కొండపాక/బెజ్జంకి ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కొండపాకలోని సమీకృత మండల కార్యాలయ సముదాయాన్ని కలెక్టర్ హైమావతి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూ భారతి ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియపై ఆయా కార్యాలయాల్లో, తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి రెవెన్యూ సదస్సుల పెండింగ్ అప్లికేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియ గూర్చి ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. 273 మంజూరైతే 237 మాత్రమే గ్రౌండింగ్ అయ్యాయని వందశాతం గ్రౌండింగ్ కావాలని ఆదేశించారు. ఇల్లు నిర్మించుకోవడానికి సుముఖంగా లేని వారికి నోటీస్ ఇచ్చి వారి పేరు తొలగించి మరొక లబ్ధిదారుకు మంజూరు చేయాలని తెలిపారు. నిర్మాణంలో ఉన్న ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తిచేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ శ్యాం, ఎంపీడీవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

#### నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు.

మెరుగైన వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ హైమావతి హెచ్చరించారు. శుక్రవారం బెజ్జంకి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. పీహెచ్‌సీని, ఆగ్రోస్ రైతుసేవా కేంద్రాన్ని, తహసీల్దార్ కార్యాలయాన్ని, గుండారం జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. పీహెచ్‌సీలో స్టాఫ్ నర్సు లక్ష్మీ, అటెండర్ తప్ప సమయానికి సిబ్బంది ఎవరు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో రైతులకు అందించిన ఎరువుల వివరాలను ఆరా తీశారు. స్టాక్, సేల్స్ రిజిస్టర్లను పరిశీలించి, వివరాలు మ్యాచ్ కాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. గుండారం జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆలస్యంగా వండుతున్న వంట సిబ్బందిపై, ప్రాథమిక పాఠశాలను సందర్శించి పాఠశాలకు హాజరైన విద్యార్థులకు సరిపడా కూర వండట్లేదని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని లేదంటే సిబ్బందిని మార్చాలని పాఠశాల ఉపాధ్యాయులను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ చంద్రశేఖర్, ఎస్ఐ సౌజన్య, ఎంపీవో మంజుల, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 94 మంది బాలకార్మికులకు విముక్తి

- ముగిసిన 'ఆపరేషన్ ముస్కాన్'
- నెల రోజుల్లో 84 మంది బాలురు, 10 బాలికల గుర్తింపు
- పని చేయించుకున్న 27 మంది షాప్ యజమానులపై కేసు



సిద్దిపేట క్రైం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నేటి బాలలే రేపటి పౌరులు అని అంటారు మన పెద్దలు. కానీ, ప్రస్తుత కాలంలో బాలలు చదువుకు దూరమై పరిశ్రమల్లో, హోటళ్లు, బేకరీలలో మెకానిక్ షాపులలో వెట్టి చాకిరి చేస్తున్నారు. కొంతమంది తల్లిదండ్రులు కుటుంబ పోషణ భారమై పిల్లలను చదివించే ఆర్థిక స్థోమత లేక పనిలోకి దించుతున్నారు. మరి కొంతమంది చిన్నారులు తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారి దిక్కులేని పరిస్థితిలో బాల్యంలోనే పనిలోకి దిగుతున్నారు.

ప్రతి సంవత్సరం ఆపరేషన్ ముస్కాన్ పేరిట పోలీసులు, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ, స్వచ్ఛంద సంస్థలు, చైల్డ్ లైన్ ప్రతినిధులు సంయుక్తంగా కలిసి పరిశ్రమలు, మెకానిక్ షాపులు, బేకరీలు, హోటళ్లలో, ఇటుక బట్టీలలో తనిఖీలు నిర్వహించి బాల కార్మికులను గుర్తించి వారి తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు, బంధువులకు అప్పగిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులను వారి కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి వారి స్వస్థలాలకు పంపిస్తున్నారు.

### ఆపరేషన్ ముస్కాన్ ద్వారా...

జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ జూలై 1 నుంచి 31 వరకు నిర్వహించారు. ఆపరేషన్ ముస్కాన్‌లో పోలీస్ అధికారులు, సిబ్బంది, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్, ఎడ్యుకేషన్, చైల్డ్ ప్రొటెక్షన్, హెల్త్, వివిధ డిపార్ట్‌మెంట్‌ల అధికారులు, సిబ్బందితో నెలరోజులు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. ఇందులో 94 మంది బాల కార్మికులను గుర్తించారు. అందులో 84 మంది మగ పిల్లలు, 10 మంది ఆడపిల్లలను గుర్తించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్, నేపాల్, బీహార్, కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మేఘాలయ రాష్ట్రాలకు చెందిన పిల్లలను వారి వారి తల్లిదండ్రులకు బంధువులకు కౌన్సెలింగ్ ఇచ్చి అప్పగించారు. జిల్లాలో బాల కార్మికులతో పనిచేయించుకుంటున్న 27 మంది షాప్ యజమానులపై కేసులు నమోదు చేశారు.

> **బాలకార్మికులతో పనిచేయిస్తే చర్యలు : సీపీ**
>
> జిల్లాలో పరిశ్రమలు, హోటళ్లు, బేకరీలు, మెకానిక్ షాపులు, ఇటుక బట్టీల్లో బాల కార్మికులతో పని చేయించినా, భిక్షాటన చేయించినా చర్యలు తప్పవు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా జిల్లాలో 94 బాల కార్మికులను గుర్తించి వారి కుటుంబీలకు అప్పగించారు. అలాగే 27 మంది దుకాణ యజమానులపై కేసులు నమోదు చేశాం. ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే పోలీసులకు, శిశుసంక్షేమ అధికారులకు సమాచారం ఇవ్వాలి.

## మొదటి రోజే మొరాయించిన యాప్!

- 'ఎఫ్ఆర్ఎస్'తో ఉపాధ్యాయుల హాజరు షురూ
- ఇక దుమ్మా కొట్టే ఉపాధ్యాయులకు చెక్

కొండపాక, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఫేస్ రికగ్నేషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) విధానాన్ని అమలు చేసేందుకు విద్యాశాఖ నడుం బిగించింది. శుక్రవారం నుంచి జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఎఫ్ఆర్ఎస్ ద్వారా ఉపాధ్యాయుల హాజరు ప్రారంభమైంది. అయితే అన్ని పాఠశాలల్లో ఒకేసారి ఉపాధ్యాయులు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ప్రయత్నించడంతో యాప్ మొరాయించింది. సర్వర్ డౌన్ కావడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు. యాప్ నమోదులో ఏమైనా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులు సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం దుర్వినియోగం కాకుండా పాఠశాల విద్యాశాఖ ఇప్పటికే "డీఎస్ఈ-ఎఫ్ఆర్ఎస్" అనే యాప్‌ను రూపొందించి అమలు చేస్తోంది. ఆ యాప్‌లో విద్యార్థుల నమోదు, హాజరు, మధ్యాహ్న భోజన వివరాలు, పాఠశాల కార్యక్రమాల విభాగాలు ఉన్నాయి. ఇప్పుడు ఉపాధ్యాయుల హాజరు నమోదుపైనా విద్యాశాఖ దృష్టి సారించింది. సమగ్ర శిక్షా అధికారులు "డీఎస్ఈ-ఎఫ్ఆర్ఎస్" యాప్‌లో స్టాఫ్ రిజిస్ట్రేషన్, స్టాఫ్ అటెండెన్స్ పేరుతో కొత్త విభాగాలను రూపొందించారు. ఆగస్టు 1 నుంచి పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరును ఈ యాప్‌లో నమోదు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో నిన్న ఉదయం నుంచే ఉపాధ్యాయులు హాజరును నమోదు చేసుకునే ప్రయత్నం చేశారు.

### సమయపాలన పాటించని వారికి చెక్

జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, కేజీబీవీ మోడల్ స్కూళ్లు, గురుకులాలు కలిపి మొత్తం 1032 పాఠశాలలున్నాయి. వీటిలో సుమారు

మిగతా 8వ పేజీలో

### హ్యామ్.. నై..హామ్!

- 'పల్లా' కృషి వల్లే సాధ్యం
- కాదు కాదు 'కొమ్మూరి' వల్లే..
- పోటాపోటీగా ఫ్లెక్సీలకు క్షీరాభిషేకాలు

8

### వానాకాలం జ్వరాల ముప్పు

- జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి
- వైద్యుల సూచనలు పాటించాలి

7

### దూళిమిట్ట ఎంపీడీవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు

- కూటిగల్ పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు
- సిద్దిపేట డీపీవో దేవకీదేవి

7

# ఆపరేషన్ ముస్కాన్ సక్సెస్

- 126 మంది పిల్లలకు విముక్తి
- 81 మంది యజమానులపై కేసులు

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో 15 సంవత్సరాల బాలుడు ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. చదువుపై ఇష్టం ఉన్నప్పటికీ కుటుంబ పేదరికం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా హోటల్‌లో పనిచేస్తూ తన తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉన్నాడు. గత నెల మొదటి వారంలో జిల్లా సంక్షేమ, పోలీసు, కార్మిక శాఖ అధికారులు తనిఖీలు చేయగా సదరు బాలుడు హోటల్‌లో పనిచేస్తున్నట్టు గుర్తించారు. హోటల్ యజమానికి నోటీసులు ఇచ్చి ఆ బాలుడికి విముక్తి కలిగించారు. అంతేగాక బాలుడిని ఓ పాఠశాలలో చేర్పించి సంక్షేమ హాస్టల్‌లో ఉంచారు. దీంతో బాలుడి ముఖంపై చిరునవ్వులు చిందాయి. ప్రస్తుతం ఎంతో హుషారుగా బడికి వెళ్తున్నాడు.

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బడికెళ్లకుండా పని చేస్తున్న బాల కార్మికుల గుర్తింపు కోసం గతనెలలో చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ విజయవంతమైంది. జిల్లాలో అనేక మంది బడీడు పిల్లలు బాల కార్మికులుగా పనిచేస్తున్నారు. నిరక్షరాస్యత, ఆర్థిక వెనుకబాటు వల్ల చిన్నారులు వివిధ పనులు చేస్తున్నారు. తల్లిదండ్రులు లేని మరికొందరు పిల్లలు, తల్లిదండ్రులు ఉండి నిరాదరణకు గురవుతున్న పిల్లలు బిక్షాటన చేస్తున్నారు. ఇలా అనేక మంది పిల్లలు హోటళ్లు, ఇటుక బట్టీల వద్ద, వివిధ పనులు చేస్తున్నారు. ఇలాంటి పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేందుకు ప్రభుత్వం గతనెల 1వ తేదీ నుంచి 31వరకు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని నిర్వహించింది. జిల్లా మహిళా సంక్షేమ శాఖ, కార్మిక, పోలీసు అధికారులు, బాలల సంరక్షణ కమిటీలు సంయుక్తంగా జిల్లాలోని హోటళ్లు, ఇటుక బట్టీల వద్ద, దుకాణాలు, చిన్న చిన్న పరిశ్రమలలో మూకుమ్మడిగా మెరుపు దాడులు నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా బాల కార్మికులకు విముక్తి కల్పించి, పాఠశాలలో చేర్పించారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా మొత్తం 126 మంది బాల కార్మికులను గుర్తించి విముక్తి కల్పించారు. ఇందులో 119 మంది బాలురు, 7గురు బాలికలు ఉన్నారు. బాలలను కార్మికులుగా పనిలో పెట్టుకున్న 81 మందిపై కేసులు నమోదు చేశారు. వీరిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోనున్నారు.

**సంవత్సరంలో రెండుసార్లు తనిఖీలు..**

బాల కార్మికులను గుర్తించి బడిలో చేర్పించేందుకు ప్రభుత్వం సంవత్సరంలో ఆరునెలలకోసారి ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తుంది. జిల్లా మహిళా సంక్షేమ శాఖ, కార్మిక, పోలీసు అధికారులు, బాలల సంరక్షణ కమిటీ అధికారులు సంయుక్తంగా పనిప్రదేశాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం జనవరి నెలలో ఆపరేషన్ స్మైల్, జూలై నెలలో ఆపరేషన్ ముస్కాన్ పేరిట ఈ తనిఖీలు చేపడతారు. హోటళ్లు, ఇటుక బట్టీల వద్ద, పరిశ్రమలు, దుకాణాల్లో దాడులు నిర్వహించి 18 సంవత్సరాల లోపు బాల కార్మికులను గుర్తించి వారిని శిశు సదనాలకు తరలిస్తారు. అనంతరం బడిలో చేర్పించి చదువు చెప్పిస్తారు.

**బాల కార్మికులు కనిపిస్తే ..**


పరితోష్ పంకజ్, జిల్లా ఎస్పీ

18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న పిల్లలను పనిలో పెట్టుకున్నా, వెట్టి చాకిరికి గురి చేసినా కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ హెచ్చరించారు. పిల్లలతో బలవంతంగా బిక్షాటన చేయించినా, పశువుల కాపరులుగా, కిరాణం దుకాణాల్లో, మెకానిక్ షాప్‌లు, హోటళ్లు, ఇటుక బటట్టీలు, పౌల్ట్రీ ఫాంలలో ఇతర ప్రదేశాల్లో పనులు చేయించడం చట్టరీత్యా నేరమని అన్నారు. ఒకవేళ పనిలో పెట్టుకుంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అన్నారు. బాల కార్మికులు ఎవరికైనా కనిపిస్తే చైల్డ్ లైన్ నంబరు 1098 లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన వెల్లడించారు.

## 160 గ్రాముల గంజాయి పట్టివేత

చేగుంట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా గంజాయి విక్రయాలు జరుపుతున్నారన్న సమాచారంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు ఓ ఇంటిలో సోదాలు జరిపి 160 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ సీఐ గోపాల్ తెలిపిన వివరాలు ప్రకారం ప్రొహిబిషన్ ఎక్సైజ్ జిల్లా అధికారి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు చేగుంట మండల కేంద్రంలోని నాగులమ్మ కాలనీలో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఆస్మాపుల్ షేక్, అక్రమంగా గంజాయి విక్రయాలు జరుపుతున్నారని సమాచారం మేరకు అతడి ఇంటిలో సోదాలు జరిపారు. అతడి నుంచి 160 గ్రాముల గంజాయి, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఎన్‌డీపీఎస్ చట్ట ప్రకారం కేసు నమోదు చేసుకొని రామాయంపేట ఎస్హెచ్‌వోకు అప్పగించినట్లు టాస్క్ ఫోర్స్ సీఐ గోపాల్ తెలిపారు, గంజాయి మత్తు పదార్థాలు విక్రయించిన సేవించిన చట్ట ప్రకారం నేరమని అటువంటి వారి గురించి సమాచారం తెలియపరచాలని కోరారు.



## బాలిక అదృశ్యం


దుర్గా భవాని(ఫైల్)

కల్హేర్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కల్హేర్‌లో దుర్గాభవాని (14) అనే బాలిక అదృశ్యమయింది. కల్హేర్ ఎస్సై మధుసూధన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా నిజాం సాగర్ మండలం బ్రహ్మణపల్లి గ్రామానికి చెందిన అన్నారం రాములు, లక్ష్మిలు ఉపాధి కోసం హైదరాబాద్‌లో ఉంటున్నారు. వారి కూతురు అయిన దుర్గాభవానిని విద్యాభ్యాసం కోసం అమ్మమ్మ గారి గ్రామమైన కల్హేర్‌లోని మేనమామ పోచబోయిన రమేష్ దగ్గర ఉంచారు. గురువారం సాయంత్రం 6 గంటల నుంచి కనబడటం లేదని కుటుంబ సభ్యులు శుక్రవారం సమాచారం ఇచ్చినట్లు ఎస్సై తెలిపారు. బాలిక తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుచున్నట్లు ఆయన తెలిపారు.

## పేకాట స్థావరంపై దాడి

కంగ్టి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని భీంరాలో శుక్రవారం పేకాట స్థావరంపై దాడి చేసి 7 మంది పేకాట రాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు కంగ్టి సీఐ వెంకట్‌రెడ్డి , ఎస్సై దుర్గారెడ్డి తెలిపారు.

# అర్హులందరికీ రేషన్ కార్డులు


మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మాసాయిపేట/వెల్దుర్తి,ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి నిరుపేదకు రేషన్ కార్డులను పంపిణీ చేస్తామని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం వెల్దుర్తి, మాసాయిపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే సునీతారెడ్డితో కలిసి కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో 45వేల కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు.

వెల్దుర్తి మండలంలో 385 నూతన రేషన్ కార్డులు, 1489 కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేసుకున్నారని కలెక్టర్ వివరించారు. రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం అని, అర్హులందరికీ రేషన్ కార్డులను అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, 2,61,000 మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా 220 కోట్ల రూపాయలు జమ చేశామని చెప్పారు.

87 వేల మంది రైతులకు రుణమాఫీ అయిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. రేషన్ కార్డు కుటుంబానికి గుర్తింపని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వాలని ఆమె అన్నారు. రేషన్ కార్డుతో బియ్యంవిద్యా, స్కాలర్‌షిప్, సీఎంఆర్ఎఫ్, ఆరోగ్యశ్రీ వంటి పథకాలకు ఉపయోగపడుతుందన్నారు.

## అధిక ధరలకు అమ్మితే చర్యలు

చిన్నశంకరంపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పంటల సాగుకు సరిపడ యూరియా అందుబాటులో ఉందని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం చిన్నశంకరంపేట మండలకేంద్రంలోని ఆగ్రోస్ కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు యూరియాను ఎమ్మార్పీ రేట్లకు అమ్మాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని ఫర్టిలైజర్ షాపు యాజమానులకు హెచ్చరించారు. మండలంలోని అన్ని గోదాంలు, విక్రయ కేంద్రాల్లో విధిగా స్టాక్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు.



## గొర్రెల్లో వ్యాధి నిరోధానికి టీకాలే ప్రధానం

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గొర్రెల్లో వ్యాధి నిరోధానికి టీకాలే ప్రాధాన్యమని ఉచిత వ్యాధి నివారణ టీకాలను పాడిరైతులు, గొర్రె కాపరులు సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. సంగారెడ్డి మండలం తాళ్లపల్లి గ్రామంలో గొర్రెలకు నీలి నాలుక వ్యాధి నివారణ వాక్సిన్ పంపిణీ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ వైద్యులు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ గొర్రెల్లో వచ్చే నీలి నాలువ వ్యాధి వల్ల గొర్రెల కాపరులు, పాడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ప్రభుత్వం గొర్రెలకు ఉచితంగా నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు వేస్తుందన్నారు.


మందులను పరిశీలిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

## కామెర్ల వ్యాధితో యువకుడి మృతి


గణేష్ (ఫైల్)

కుకునూరుపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కామెర్ల వ్యాధితో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన కుకునూర్‌పల్లి మండల కేంద్రంలో జరిగింది. మండల కేంద్రానికి చెందిన న్యాలపోగుల గణేష్(25) బార్బర్‌షాప్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా గణేష్ కామెర్ల వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స కూడా తీసుకున్నాడు. అనుకోకుండా గణేష్ గురువారం రాత్రి మరణించాడు. మృతుడికి 18 నెలల కుమారుడు ఉన్నాడు. అతడి భార్య ఇప్పుడు గర్భిణీ. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి ..

కంగ్టి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అనుమానస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం రాత్రి మండల పరిధిలోని తుర్కవడ గాంలో జరిగింది. ఎస్సై దుర్గారెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తుర్కవడగాం గ్రామానికి చెందిన కింది దొడ్డి సోపాన్(36) గురువారం అదే గ్రామానికి చెందిన షెట్కార్ ఈశ్వరప్పకు చెందిన పొలంలో పత్తి పంటకు మందు స్ప్రే చేయడానికి నీళ్ల పోసేందుకు కూలి పనికి వెళ్లాడు. సమీపంలోని బావి నుంచి సాయంత్రం వరకు నీరు తెచ్చి పోసిన సోపాన్ ఆ తరువాత ఎంత సేపటికి నీటి బిందె తీసుకొని రాక పోవడంతో తోటి కూలీలు శంకర్, తులసీరాంతో పాటు పొలం యజమాని ఈశప్పలు కలిసి పరిసర ప్రాంతాల్లో వెతికారు. చివరకు బావి వద్దకు వెళ్లి చూడగా ఖాళీ బిందె మాత్రమే కనిపించిందని తెలిపారు. దీంతో అనుమానం వచ్చి మోటార్‌తో బావిలోని నీటిని ఖాళీ చేయించగా సోపాన్ మృతదేహం లభ్యమైంది. సోపాన్ అనుమానస్పద మృతి పట్ల ఆయన భార్య మీరాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దుర్గారెడ్డి తెలిపారు.


## చెరువులో పడి ఒకరు..

కంది, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కవలంపేట ఊదం చెరువులో గురువారం రాత్రి ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కవలంపేట గ్రామానికి చెందిన మున్నూరు జగన్మోహన్ (42) వ్యవసాయ రైతు కూలీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి గ్రామంలోని ఊదం చెరువు కట్ట వద్ద మద్యం సేవించి ప్రమాదవశాత్తు చెరువులో జారిపడ్డాడు. నీట మునిగి ఊపిరాడక మృతి చెందాడు. జగన్మోహన్‌కి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఆ గ్రామస్థులు, స్థానికుల సహాయంతో శుక్రవారం ఉదయం జగన్మోహన్ మృతదేహాన్ని వెలికి తీసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం జరిపించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

## కడుపునొప్పి తాళలేక కార్మికుడు..

పటాన్‌చెరు ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక ఓ కార్మికుడు మృతి చెందిన సంఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ జయకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్ రాష్ట్రం కైమూర్ జిల్లా కౌదిరామ్ గ్రామానికి చెందిన మురళీకుమార్ (32)పాశమైలారం పారిశ్రామికవాడ సాయిసాగర్ ఫుడ్ ఇండస్ట్రీ పరిశ్రమలో కార్మికుడుగా పని చేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం సమయంలో కడుపు నొప్పి వస్తుందంటూ ఫ్యాక్టరీలోని ఒక గదిలో పడుకున్నాడు. నిద్రలోనే మృతి చెందాడు. కౌదిరామ్ గ్రామస్థుడు నితీష్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

## చెరువులో మునిగి మత్స్యకారుడు..


సత్యనారాయణ (ఫైల్)

వెల్దుర్తి, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి చెరువులో నీట మునిగి ఓ మత్స్యకారుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని చర్లపల్లి గ్రామ శివారులోని నర్సిన్ చెరువులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్దుర్తి పట్టణానికి చెందిన పంపరి సత్యనారాయణ( 49) మరో వ్యక్తితో శుక్రవారం చర్లపల్లిలోని నర్సిన్ చెరువులో చేపల వేటకు వెళ్లారు. చెరువులో చేపలు పట్టడానికి వెళ్లిన సత్యనారాయణ కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో తోటి మత్స్యకారులు చెరువులో గాలింపు చేపట్టారు. చెరువులో గల్లంతైన మృత దేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య కళావతి, కూతురు లావణ్య ఉన్నారు.



ఫార్మర్ లోడర్ వాహనాన్ని నడుపుతున్న ఆవిష్కర్త తెలుగు రాజశేఖర్

# భలే వాహనాలు

## బ్యాటరీ బండ్ల తయారీలో యువ ఇంజనీర్

జహీరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ మండలం అల్గోల్‌కు చెందిన యువ ఇంజనీర్ తెలుగు రాజశేఖర్ తన ఆవిష్కరణలతో ఆకట్టుకుంటున్నాడు. తనలోని సృజనాత్మకతకు పదును పెట్టి బ్యాటరీతో నడిచే వాహనాలను తయారు చేస్తున్నాడు. పాత వాహనాల విడిభాగాలను ఉపయోగించి సైకిల్, త్రీ వీలర్, ఇప్పుడు నాలుగు చక్రాల ఫార్మర్ లోడర్‌ను తయారు చేశాడు. సైకిల్ తయారీకి రూ. 30 వేలు, త్రీ వీలర్‌కు రూ.40 వేలు, ఫార్మర్ లోడర్‌కు రూ.1.50లక్షలు ఖర్చు చేశానని రాజశేఖర్ తెలిపారు. నారాయణఖేడ్ ప్రభుత్వ ఐటీఐలో డీజిల్ మెకానికల్ కోర్స్‌ను చదివి, జహీరాబాద్ మహీంద్రా కర్మాగారంలో అప్రెంటీస్‌గా పనిచేశాడు. రైతులకు పొలాల్లో ఉపయోగపడే ఫార్మర్ లోడర్‌ను రూపొందించడం పట్ల రాజశేఖర్ సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కొత్త ఆవిష్కరణలను చేపట్టడానికి ఆసక్తి చూపుతున్నానని తెలిపారు. అతని ఆవిష్కరణలు స్థానికంగా ప్రశంసలు అందుకుంటున్నాయి.





రాజశేఖర్ తయారు చేసిన త్రీ వీలర్ వాహనం, సైకిల్

## దూళిమిట్ట ఎంపీడీవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు

- కూటిగల్ పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు
- సిద్దిపేట డీపీవో దేవకీదేవి

మద్దూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): దూళిమిట్ట ఎంపీడీవో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రజలకు, అధికారులకు అందుబాటులో ఉండటం లేదని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) దేవకీదేవి ఆరోపించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఆమె జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఆమె దూళిమిట్ట మండలంలోని కూటిగల్ గ్రామాన్ని సందర్శించారు. అక్కడ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని పరిశీలించారు. గ్రామానికి మంజూరైన 218 ఇళ్లలో 114 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నట్లు తెలిపారు. నిర్మాణ పనులను వేగవంతం చేయడంలో నిర్లక్ష్యం వహించిన పంచాయతీ కార్యదర్శి అనితకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. తన సందర్శన సమయంలో ఎంపీడీవో మీసాల వీరరాజ్ అందుబాటులో లేకపోవడం, ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఆయనపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు డీపీవో తెలిపారు. అనంతరం మద్దూరు ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి, ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, ఓటరు జాబితా తయారీపై పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు. ఆమె వెంట ఎంపీఈవో రాంమోహన్, ఎంపీవో వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

- వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి
- సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చుక్కా రాములు




సమావేశంలో మాట్లాడుతున్న చుక్కా రాములు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లను 42 శాతం అమలు చేసి, వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చుక్కా రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం సిద్దిపేటలో నిర్వహించిన పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగకపోవడం వల్ల గ్రామాల్లో పాలన స్తంభించిపోయిందని, సమస్యలు పేరుకుపోతున్నాయని అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆమోదించకుండా కాలయాపన చేయడం బీసీల పట్ల వారికి ఏమేరకు చిత్తశుద్ధి ఉందో తెలియజేస్తుందని విమర్శించారు. మోదీ ప్రభుత్వం అమెరికా సామ్రాజ్యవాదానికి తలుపులు తెరిచిందని, ట్రంప్ 25 శాతం సుంకాలను పెంచినా మోదీ ప్రభుత్వం నోరు మెదపడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన పథకాలను నిజమైన లబ్ధిదారులకు అందేలా చూడాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు గోపాలస్వామి, కార్యదర్శి మల్లారెడ్డితో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

## రాజకీయ కక్షతోనే రామాలయం స్వాధీనానికి కుట్ర

- ఆందోళనతో వెనుదిరిగిన ఎండోమెంట్ అధికారులు

మెదక్ అర్బన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : రాజకీయ కక్షతోనే మెదక్ జిల్లా కేంద్రంలోని కోదండ రామాలయాన్ని స్వాధీనం చేసుకునేందుకు కుట్ర జరుగుతోందని బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ ఆరోపించారు. దేవాదాయశాఖ అధికారులు రాజకీయ నాయకులకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆయన మండిపడ్డారు. శుక్రవారం ఆలయాన్ని స్వాధీనం చేసుకోవడానికి వచ్చిన దేవాదాయశాఖ అధికారులను బీజేపీ నాయకులు, భక్తులు అడ్డుకున్నారు. పట్టణ సీఐ మహేష్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. బీజేపీ నాయకులు 'ఎండోమెంట్ గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. ఈ విషయం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు దృష్టికి వెళ్లడంతో, ఆయన ఫోన్‌లో అధికారులతో మాట్లాడి వెంటనే వెళ్లిపోవాలని హెచ్చరించారు. దీంతో దేవాదాయశాఖ సిబ్బంది వెనుదిరిగారు. ఈ సందర్భంగా గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ 50 ఏళ్లుగా భక్తులు, దాతల సహకారంతో ఆలయం అభివృద్ధి చెందిందని, రాజకీయ ఫిర్యాదుతో స్వాధీనం చేసుకోవడం సరికాదని అన్నారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల మేరకు వచ్చామని, అనివార్య కారణాల వల్ల స్వాధీనం ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.

# వానాకాలం.. జ్వరాల ముప్పు

- జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి
- వైద్యుల సూచనలు పాటించాలి



మెదక్, కల్చరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం వచ్చిందంటే చాలు, వాతావరణం చల్లబడి ఆహ్లాదంగా ఉంటుంది. కానీ ఈ చల్లని వాతావరణం అనేక రోగాలను కూడా తీసుకొస్తుంది. ముఖ్యంగా వైరల్ జ్వరాలు, జలుబు, దగ్గు వంటివి ఎక్కువగా ఉంటాయి. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలు కూడా ఎక్కువగా ప్రబలుతాయి. వీటి బారిన పడకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు పాటించడం చాలా ముఖ్యం. వైద్యుల సూచనలు పాటించాలి.

### జ్వరాలు.. వాటి లక్షణాలు

- వైరల్ జ్వరాలు జ్వరాలు ఉన్నపళంగా వస్తాయి. జ్వరం చాలా ఎక్కువగా (102 డిగ్రీల ఫారన్‌హీట్ వరకు) ఉంటుంది. తలనొప్పి, ఒళ్లు నొప్పులు, నీరసం, వాంతులు, అజీర్తి వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొన్నిసార్లు శరీరంపై దద్దుర్లు కూడా వస్తాయి.
- దోమల ద్వారా డెంగీ, మలేరియా జ్వరాలు వ్యాప్తి చెందుతాయి. అధిక జ్వరం, ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు, తలనొప్పి వంటివి ఈ జ్వరాల లక్షణాలు. వీటిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం కూడా సంభవించవచ్చు.
- కలుషితమైన నీరు, ఆహారం తీసుకోవడం వల్ల టైఫాయిడ్ వస్తుంది. ఇది సాధారణంగా కడుపు నొప్పి, వాంతులు, జ్వరంతో మొదలవుతుంది.
- చికున్‌గున్యా కూడా దోమల ద్వారా వ్యాప్తి చెందే వైరల్ జ్వరం. దీని లక్షణాలు అధిక జ్వరం, కీళ్ల నొప్పులు.
- వర్షాకాలంలో వాతావరణ మార్పుల వల్ల సాధారణ జలుబు, ఫ్లూ రావడం సర్వసాధారణం. గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తాయి.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- కాచి చల్లార్చిన నీటినే తాగాలి. బయటి ఆహారం, ఫాస్ట్‌ఫుడ్ తినడం మానేయాలి. తాజా, వేడిగా వండిన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి. పండ్లు, కూరగాయలను శుభ్రంగా కడిగి తినాలి.
- ఇల్లు, పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. నీరు నిల్వ ఉండే పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ డబ్బాలను పారేయాలి. దోమలు ఇంట్లోకి రాకుండా కిటికీలకు నెట్‌లు వాడాలి.
- చేతులను తరచుగా సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. వర్షంలో తడిస్తే వెంటనే పొడి బట్టలు వేసుకోవాలి.
- రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి పౌష్టికాహారం తీసుకోవాలి. నిమ్మ, నారింజ వంటి సిట్రస్ పండ్లు ఎక్కువగా తింటే మంచిది.
- జ్వరం, ఒళ్లు నొప్పులు, దగ్గు లాంటి లక్షణాలు కనిపిస్తే సొంత వైద్యం అస్సలు చేయకూడదు. వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. నిర్లక్ష్యం చేస్తే తీవ్రమైన సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది.

### వర్షాకాలం జాగ్రత్తలు ఎంతో ముఖ్యం



వర్షాకాలం వచ్చిందంటే చాలు చిన్నపిల్లలు ఎక్కువగా అనారోగ్యానికి గురి అవుతుంటారు. బయటకు వెళితే తప్పకుండ గొడుగు లేదా రెయిన్‌కోట్‌లను తీసుకెళ్లాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. వేడి ఆహారాన్ని తీసుకోవాలి. పరిసరాలలో పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నూనె పదార్థాలకు దూరంగా ఉండాలి. వర్షంలో తడిస్తే జలుబు, జ్వరం వస్తే వెంటనే వైద్యున్ని సంప్రదించాలి. దగ్గు, దమ్ము ఉన్న వారు ఎక్కువ జాగ్రత్తగా వహించాలి. డెంగీ, మలేరియా లాంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుంది కాబట్టి నిర్లక్ష్యం చేయకూడదు.

**- డాక్టర్ నాగేంద్రబాబు, ఎంబీబీఎస్, డీఎన్‌బీ, పిల్లల వైద్య నిపుణులు**



జెండా ఊపి ప్రారంభిస్తున్న పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీనటరాజన్, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు దామోదర్, పొన్నం, వివేక్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి తదితరులు



పాదయాత్రలో జనం

# జనహిత జోష్

(5వ పేజీ తరువాయి) పనిచేసే పార్టీ అని అన్నారు.

### దామోదర్‌కు ప్రశంసలు

జనహిత పాదయాత్ర సందర్భంగా మంత్రి దామోదర్‌ను.. మహేశ్ కుమార్ గౌడ్, మీనాక్షీ నటరాజన్, జగ్గారెడ్డి ప్రశంసించారు. తాను ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడిగా ఉన్నప్పటికే దామోదర్ ఎమ్మెల్యే అయ్యారని, ఆయన నుంచి తానెంతో నేర్చుకున్నానని మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. రాజకీయాల్లో ఓనమాలు నేర్పిన గురువని అన్నారు. తనకు.. అప్పటి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధీర్‌కుమార్‌కు దామోదర్ భీష్ముడిలా మార్గనిర్దేశం చేశారని కొనియాడారు. మీనాక్షీ నటరాజన్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల ప్రియతమ నాయకుడైన దామోదర్ ఆ ప్రేమకు ఎందుకు అర్హుడో ఇక్కడి అభివృద్ధిని చూస్తుంటేనే తెలుస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి మాట్లాడుతూ ఆలోచన.. నిబద్ధతతోనే ఆయన ఈస్థాయికి ఎదిగారని అన్నారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్మోహన్ రెడ్డి, త్రిష దామోదర్, గిరిజా షెట్కార్ తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రలో చిందేస్తున్న మంత్రి దామోదర్



మాట్లాడుతున్న మహేష్‌కుమార్‌గౌడ్



# మట్టి.. కొల్లగొట్టి

- అనుమతుల పేరుతో అర్ధరాత్రి అక్రమ రవాణా
- ప్రశ్నిస్తే సీఎం తెలుసంటూ బెదిరింపులు

కొల్చారం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కొల్చారం మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామంలో అక్రమ మట్టి రవాణా జోరుగా సాగుతోంది. స్థానిక నాయకుల అండతో ఓ నాయకుడు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ రాత్రింబవళ్లు మట్టిని తరలిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### నన్నెవరూ అడ్డుకోలేరు..

పోతంశెట్టిపల్లిలోని ఏడుపాయలకు వెళ్లే రహదారి పక్కన సుమారు 20 ఎకరాల వ్యవసాయ భూమిని లీజుకు తీసుకున్న కొందరు వ్యక్తులు రిసార్ట్, భవనాలను నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణాల కోసం పెద్ద మొత్తంలో మట్టి అవసరం కావడంతో అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. పాపన్నపేట మండలం నుంచి తెచ్చిన ధ్రువీకరణ పత్రాలతో రాత్రిపూట నంబర్ లేని టిప్పర్ వాహనాల్లో మట్టిని తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయంపై గ్రామస్థులు ప్రశ్నిస్తే, ఆ నాయకుడు 'నాకు సీఎం తెలుసు, నన్నెవరూ అడ్డుకోలేరు' అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని సమాచారం.

### తహసీల్దార్ ఆదేశాలు బేఖాతరు

దీనిపై స్పందించిన తహసీల్దార్ శ్రీనివాస్‌చారి అనుమతి పత్రాలు తీసుకురావాలని ఆదేశించి వాటిని పరిశీలించగా, అందులో లారీ నంబర్లు, సమయపాలన లేకపోవడం గమనార్హం. రాత్రిపూట మట్టి తరలించడానికి ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. అనుమతులు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే చెల్లుబాటు అవుతాయని తెలిపారు. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అయితే, తహసీల్దార్ ఆదేశాలను సైతం లెక్కచేయకుండా అక్రమార్కులు మట్టి రవాణా కొనసాగిస్తున్నారు. ఈ నిర్మాణాలు బఫర్ జోన్ పరిధిలో ఉన్నప్పటికీ, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రిసార్ట్ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవని పోతంశెట్టిపల్లి పంచాయతీ కార్యదర్శి అరుణ కూడా ధృవీకరించారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ మట్టి రవాణాను, అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మట్టిని తరలిస్తున్న టిప్పర్

### రెండు టిప్పర్లు, ఎక్స్‌కవేటర్ పట్టివేత

సిద్దిపేట రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్ గ్రామ శివారులో శుక్రవారం అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను, ఒక ఎక్స్‌కవేటర్‌ను టాస్క్‌ఫోర్స్, రూరల్ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దుబ్బ మల్లేశం భూమి నుంచి ఎక్స్‌కవేటర్‌తో మట్టిని తవ్వి, టిప్పర్ల ద్వారా సిద్దిపేటకు తరలిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో వెంటనే స్పందించిన పోలీసులు, ఆ వాహనాలను పట్టుకుని కేసు నమోదు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# తీర్థయాత్రలకు ప్రత్యేక రైలు

- ఈ నెల 16న సికింద్రాబాద్ నుంచి ప్రారంభం

మెదక్ అర్బన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తీర్థయాత్రలకు వెళ్లే భక్తుల కోసం రైల్వేశాఖ భారత్ గౌరవ్ పేరుతో ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చిందని ఐఆర్‌సీటీసీ టూరిజం అసిస్టెంట్ మేనేజర్ పివి.వెంకటేష్ తెలిపారు. శుక్రవారం మెదక్ రైల్వే స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 16న సికింద్రాబాద్ నుంచి ఈ ప్రత్యేక రైలు ప్రారంభమవుతుందని చెప్పారు. దివ్య దక్షిణ యాత్ర జ్యోతిర్లింగాలు పేరుతో ఈ రైలు ఉజ్జయిని వరకు ప్రయాణిస్తుందన్నారు. సికింద్రాబాద్ నుంచి కామారెడ్డి, నిజామాబాద్, ధర్మాబాద్, నాందేడ్, పూర్ణా మీదుగా ఈ ప్రయాణం సాగుతుందని తెలిపారు. ఒక్కో వ్యక్తికి టికెట్ ధర సాధారణ ప్యాకేజీకి రూ.14,600, 3ఏసీకి రూ.22,900, 2ఏసీకి రూ.29,900గా నిర్ణయించామని వివరించారు. ఈ ప్యాకేజీలో పూర్తి భద్రత, ఆహారం, హోటల్ సదుపాయాలు ఉంటాయన్నారు. పూర్తి వివరాల కోసం ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని, లేదా 9701360701, 9281030740 ఫోన్‌నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## ఎన్‌సీఎంఎంకు ఐఐటీహెచ్ ఎంపిక

- బాంబే, రూర్కీ, ధన్‌బాద్ ఐఐటీలకూ చోటు

కంది, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఖనిజాల అన్వేషణకు ఎన్‌సీఎంఎం (నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్) కింద నాలుగు ఐఐటీలలో సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్ ఎంపికైంది. ఐఐటీహెచ్‌తోపాటు, బాంబే, రూర్కీ, ధన్‌బాద్ ఐఐటీలు సహా ఏడు ప్రతిష్ఠాత్మక సంస్థలను సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా గుర్తించినట్లు కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సంస్థలు కీలకమైన ఖనిజాల రంగంలో దేశ శాస్త్ర సాంకేతిక సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికి, సాంకేతికతను ముందుకు తీసుకెళ్లడానికి పరిశోధనలు చేస్తాయి. ఎలక్ట్రానిక్స్ రక్షణ, అంతరిక్షం వంటి అధునాతన సాంకేతికత రంగాలతో పాటు, క్లీన్ ఎనర్జీ, మొబిలిటీ రంగాలకు కీలకమైన ముడి పదార్థాల సరఫరాలో దోహదపడనున్నాయి. ఐఐటీహెచ్, ఐఐటీ బాంబే, ఐఐటీ రూర్కీ, ఐఐటీ ధన్‌బాద్ సంస్థలు గనుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కీలకమైన ఖనిజాలలో పరిశోధన కన్సార్టియంగా పని చేస్తాయని తెలిపింది.

## న్యూస్ బాక్స్

### ప్రైవేట్ హాస్పిటల్ పై మెడికల్ కౌన్సిల్‌లో ఫిర్యాదు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ అధ్యక్షుడు పుల్లూరి ఉమేష్ ఆధ్వర్యంలో సిద్దిపేటలోని లోహిత్ సాయి ఆసుపత్రిపై మెడికల్ కౌన్సిల్లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఉమేష్ మాట్లాడుతూ ఆసుపత్రిలో సరైన వైద్యం అందించకుండా పైసలే పరమావధిగా వ్యవహరిస్తూ పేద ప్రజల ప్రాణాలు తీస్తున్నారని ఆరోపించారు. ఆస్పత్రిపై గతంలో కలెక్టర్‌తో పాటు డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. మెడికల్ కౌన్సిల్ స్పందించి డాక్టర్ లైసెన్సు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

### తల్లి జ్ఞాపకార్థం గ్రామానికి ఫ్రీజర్ బాక్స్ అందజేత

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి మాజీ సర్పంచ్ రవీందర్‌గౌడ్ గ్రామ పంచాయతీకి సుమారు రూ.62వేల విలువ చేసే ఫ్రీజర్ బాక్స్‌ను శుక్రవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన జన్మదినాన్ని పురస్కరించుకుని తల్లి జ్ఞాపకార్థంగా ఫ్రీజర్ బాక్స్ వితరణ చేసినట్టు తెలిపారు.

### ఆలయానికి రూ.50 వేల విరాళం

నంగునూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దన్నపేట గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో నిర్మించే మాడశేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి సిద్దిపేటకు చెందిన వ్యాపారి వంగ రాజేశ్వర్‌రెడ్డి తనవంతుగా రూ.50 వేలను శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అలాగే గ్రామంలోని హనుమాన్ ఆలయంలో బోర్ మోటార్ కొరకు రూ.10 వేలు విరాళంగా ఇచ్చారు. ఆలయ నిర్మాణానికి సహకారం చేసిన వంగ రాజేశ్వర్ రెడ్డిని రజక సంఘం సభ్యులు, హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు శాలువా కప్పి సన్మానం చేశారు.

### పాలిటెక్నిక్‌లలో గెస్ట్ ఫ్యాకల్టీల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

హుస్నాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని వివిధ పాలిటెక్నిక్ కళాశాలల్లో గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హుస్నాబాద్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ లెక్చరర్లు, సివిల్ ఇంజనీరింగ్‌లో లెక్చరర్లు, ఫిజిక్స్‌లో లెక్చరర్లు, మ్యాథ్స్‌లో లెక్చరర్లు, కెమిస్ట్రీలో లెక్చరర్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, టెక్నికల్ విభాగాల కోసం బీఈ, బీటెక్ ఫస్ట్‌క్లాస్‌లో ఉండాలని, ఎంటెక్ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాల కోసం సంబంధిత సబ్జెక్టుల్లో ఫస్ట్ క్లాస్‌తో మాస్టర్ డిగ్రీ ఉండాలని, పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. మరిని వివరాలకు హుస్నాబాద్ పాలిటెక్నిక్‌లో సంప్రదించాలన్నారు.

### గెస్ట్ లెక్చరర్ పోస్టుకు...

గజ్వేల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్)లో 2025-26 విద్యా సంవత్సరానికి గానూ కంప్యూటర్ సైన్స్-అప్లికేషన్స్ తరగతులు బోధించుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజూమ్ పేర్కొన్నారు. కళాశాలలో కంప్యూటర్ సైన్స్-అప్లికేషన్స్-1 పోస్టు ఖాళీగా ఉందని, అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో ఎస్సీ, ఎస్టీలైతే 50శాతంతో, బీసీ, ఓసీలైతే 55శాతంతో పీజీ పూర్తిచేసి ఉండాలన్నారు. అలాగే యూజీసీ నెట్, సెట్, పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 4న కళాశాలలో హాజరు కావాలని సూచించారు.

### కేజీబీవీలో గెస్ట్ టీచర్‌గా..

కొండపాక, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కొండపాక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో గెస్ట్ టీచర్ (బయో సైన్స్) పోస్టు ఖాళీగా ఉందని అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గౌతమి తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, బీఈడ్ (బయో మెథడాలజీతో) టెట్ ఉత్తీర్ణత దరఖాస్తు సమయానికి టెట్ పాసైన వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు.దరఖాస్తులను ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు సాయంత్రం 5 గంటల లోపు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో అందచేయాలని తెలిపారు.

### ప్రజలకు అందుబాటులో ఉండాలి

గజ్వేల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని ఈఎంఆర్ఐ 108 సిద్దిపేట జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పీఎం జాన్‌షాహీద్ సూచించారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ క్వాలిటీ ఆడిటర్స్ కిరణ్, పకీర్‌దాస్‌లు క్వాలిటీ ఆడిటింగ్ నిర్వహించగా ఆయన పాల్గొన్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

### యూరియా కొరత లేకుండా చూడాలి

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర రైతాంగానికి రావాల్సిన యూరియా కోట తగ్గడంతో రైతులు యూరియా కొరతతో ఆందోళన చెందుతున్నారని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మందపవన్ పేర్కొన్నారు. తక్షణమే కొరత లేకుండా రైతులకు యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం సిద్దిపేటలోని ఎడ్లగురువారెడ్డి భవన్‌లో ఆయన మాట్లాడారు.

# హ్యామ్.. నై.. హమ్!

- పల్లా వల్లే... కాదు కొమ్మూరి వల్లే..
- పోటాపోటీగా ఫ్లెక్సీలకు క్షీరాభిషేకాలు




కడవేరుగు క్రాస్‌రోడ్డులో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా ఫ్లెక్సీకి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ఫ్లెక్సీకి వేర్వేరుగా క్షీరాభిషేకాలు చేస్తున్న ఆయా పార్టీల నాయకులు

చేర్యాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగపురి వరకు 13కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణానికి హ్యామ్ విధానం ద్వారా ప్రభుత్వం చర్యలు చేపట్టిన నేపథ్యంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పోటాపోటీ కార్యక్రమాలు నిర్వహించడం చర్చనీయాంశమైంది. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వినతితోనే నిధులు మంజూరయ్యాంటూ బీఆర్ఎస్ నాయకులు, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి చొరవతోనే సాకారమైందంటూ కాంగ్రెస్ నాయకులు పరస్పరం ప్రకటనలు చేస్తూ శుక్రవారం చేర్యాలలో క్షీరాభిషేకాలు నిర్వహించారు.

### ఎమ్మెల్యే పల్లా ఫ్లెక్సీకి క్షీరాభిషేకాలు

మండలంలోని పెద్దరాజుపేట, నాగపురి, శబాషీగూడెం, కడవేరుగు గ్రామాలతో పాటు చేర్యాల పట్టణంలోని కడవేరుగు క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. కొన్నినెలల క్రితం సిద్దిపేట కలెక్టరేట్‌లో నిర్వహించిన అభివృద్ధి సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పలు రోడ్ల విస్తరణకు నిధులు మంజూరు చేయాలని అప్పటి ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖతో పాటు ప్రభుత్వాన్ని కోరారన్నారు. ఈ మేరకే నిధులు మంజూరైతే కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారం చేసుకోవడం శోచనీయమని మండిపడ్డారు. ఆయా కార్యక్రమాల్లో మండలాధ్యక్షుడు అనంతుల మల్లేశం, నాయకులు పుల్లంపల్లి కరుణాకర్, బండమీది కరుణాకర్, అంక ని సురేందర్, గదరాజు యాదగిరి, అంకుగారి శ్రీధర్‌రెడ్డి, పుర్మ వెంకట్‌రెడ్డి, శివగారి అంజయ్య, జింకల పర్వతాలు, పచ్చిమడ్ల మానస, తదితరులు పాల్గొన్నారు..

### కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొమ్మూరి ఫ్లెక్సీకి..

మండలంలోని కడవేరుగుతో పాటు పట్టణంలోని గాంధీచౌక్ కడవేరుగు క్రాస్‌రోడ్డు ఆవరణలో కాంగ్రెస్ నాయకులు జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం పార్టీ మండలాధ్యక్షుడు కొమ్ము రవి మాట్లాడారు. కొమ్మూరి చొరవతోనే రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. నియోజకవర్గంలో రోడ్లు, ఇతర అభివృద్ధిపనులపై సంబంధిత శాఖ మంత్రుల దృష్టికి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తీసుకుపోవడం వల్లే సాకారమవుతున్నాయని, ఇందులో ఎమ్మెల్యే పల్లా కృషి ఎంత మాత్రం లేదన్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు దాసరి శ్రీకాంత్, పాల లక్ష్మీనారాయణ, తడక లింగం, ఆడెపు చంద్రయ్య, ఆడెపు నరేందర్, మామిడాల నాగరాజు, ముస్త్యాల యాదగిరి, మంజె మల్లేశం, పాల లక్ష్మీనారాయణ, బందిగ రాకేశ్, గూడెపు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లి పాలు తాగి రొమ్ము గుద్దే సంస్కృతి మీదే



మాట్లాడుతున్న సిద్దిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు

సిద్దిపేట ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తల్లి పాలు తాగి రొమ్ము గుద్దే సంస్కృతి మీదేనంటూ కౌన్సిలర్లపై సిద్దిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, బీఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్లు మండిపడ్డారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సిద్దిపేట పట్టణ అభివృద్ధే లక్ష్యంగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచన మేరకు అన్ని వార్డులకు సమానంగా నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. అమృత్ పథకం కింద మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు చొరవ వల్ల నిధులు రావడంతో, వారి సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి చేసుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక సిద్దిపేట మున్సిపల్ పరిధిలో రూ. 20 కోట్ల మేర అభివృద్ధి పనులకు నిధులను ఆపినట్లు తెలిపారు. కేవలం 1వ వార్డులో కాకుండా సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని 43 వార్డులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు నిధులు తీసుకువస్తే స్వాగతిస్తామన్నారు. ఎస్‌డీఎఫ్ నిధులు కేవలం కాంగ్రెస్ కౌన్సిలర్లు 5 వార్డులకు ఇస్తే మిగతా వార్డుల అభివృద్ధి ఎలా అని ప్రశ్నించారు. దీనిపై జిల్లా కలెక్టర్ కె. హైమావతి స్పందించి నిధులను సమానంగా అన్ని వార్డులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కౌన్సిలర్లు నాయకం లక్ష్మణ్, బర్ల మల్లికార్జున్, అరవింద్‌రెడ్డి, ప్రవీణ్, సద్ది నాగరాజు, సాయన్నగారి సుందర్, గుండ్ల యోగి, సతీష్, వడ్లకొండ సాయి, కో అప్షన్ సభ్యులు మేర సతయ్య, సయిద్, నాయకులు వంగ తిరుమల్‌రెడ్డి, అత్తర్ పటేల్, మోహిజ్, బింగి రాజేశం, బచ్చు రమేష్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి పరుగు పోటీలకు ఎంపిక

గజ్వేల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో వంద మీటర్ల పరుగు పందానికి గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి జ్ఞానేశ్వర్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజూమ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జ్ఞానేశ్వర్‌ను కళాశాలలో ఆమె అభినందించారు. ఇటీవల ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన వంద మీటర్ల పరుగు పందెంలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి, రాష్ట్రస్థాయికి ఎంపికైనట్టు తెలిపారు. ఈ నెల 3, 4 తేదీల్లో హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి పరుగు పందెంలో పాల్గొననున్నారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో సత్తా చాటి కళాశాలకు మంచి పేరును తీసుకురావాలని ఆకాంక్షించారు.

### తల్లిపాలే పిల్లలకు శ్రేయస్కరం

చేర్యాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రోగనిరోధకశక్తి కలిగిన తల్లిపాలే పిల్లలకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ చేర్యాల సెక్టార్ సూపర్‌వైజర్ నాగమణి అన్నారు. పట్టణంలోని అంగన్‌వాడీకేంద్రం-11లో శుక్రవారం తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ తాటిపాముల కృష్ణవేణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### పలువురిని పరామర్శించిన ఎమ్మెల్సీ

ములుగు/కొండపాక, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని మామిడాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త ఇటిక్యాల రాములు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సమాచారమందుకున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి మృతుడి ఇంటికి వెళ్లి, కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పారు. అదేవిధంగా ఇటీవల ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాశిరెడ్డి మహిపాల్ రెడ్డిని ఎమ్మెల్సీ పరామర్శించారు.

### ఎమ్మెల్యే 'పల్లా'కు పరామర్శ

మద్దూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని మద్దూరు మండలం సలాఖ్‌పూర్ గ్రామానికి చెందిన ప్రొఫెసర్ జయశంకర్ సేవా సమితి చైర్మన్ కొత్తపల్లి సతీష్‌కుమార్ శుక్రవారం పరామర్శించారు. త్వరగా కోలుకుని ప్రజా క్షేత్రంలోకి రావాలని ఆకాంక్షించారు.

## యూరియాకు ప్రత్యామ్నాయం నానో యూరియా



తొగుట కో ఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో మాట్లాడుతున్న దుబ్బాక ఏడీఏ మల్లయ్య

తొగుట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి); యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియాను వాడాలనీ దుబ్బాక ఏడీఏ (మండల ప్రత్యేక అధికారి) మల్లయ్య రైతులకు సూచించారు. శుక్రవారం తొగుట కో ఆపరేటివ్ సొసైటీ కార్యాలయాన్ని, కేజీబీవీ గురుకుల బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు పంటల దశల ఆధారంగా మాత్రమే యూరియాను సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఒకే విడతలో పూర్తిగా సరిపడా యూరియాను ఒకేసారి తీసుకుపోదామని రైతులు అడగడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. అనంతరం కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తొగుట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు రాధాకిషన్, ఏవో మోహన్, కేజీబీవీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, ఏఈవో రాజేష్, సొసైటీ సీఈవో గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- **కొమురవెల్లి:** మండలంలోని అయినపూర్ గ్రామంలో నానో యూరియా వాడకంపై శుక్రవారం వ్యవసాయశాఖ అధికారులు గ్రామంలోని రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. నానో యూరియాను పిచికారీ చెయ్యడం వల్ల నేరుగా మొక్కల ఆకులపై పడి ఎక్కువ పోషకాలనుగ్రహిస్తాయన్నారు.పంట దిగుబడి కుడా సుమారు 8 శాతం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకట్రావమ్మ, ఏఈవోలు రవళి, భాస్కర్ రెడ్డి,ఇఫ్కో కంపెనీ ప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.
- **మిరుదొడ్డి:** రైతులు నానోయూరియాను వాడడం వల్ల భూసారం దెబ్బతినకుండా ఉంటుదని అక్బర్‌పేట-భూంపల్లి వ్యవసాయాధికారి సత్యాన్వేష్ సూచించారు. శుక్రవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలంలో రైతువేదిక వద్ద రైతులకు నానోయూరియాపై అవగాహన కల్పించారు. అనంతరం బేగంపేట గ్రామంలో ఓ రైతు పొలం వద్ద డ్రోన్‌ద్వారా నానో యూరియాను పిచికారీని పరిశీలించారు.

## 'ఇందిరమ్మ ఇళ్ల'కు ఆవాస్ ప్లస్ రీసర్వే

(5వ పేజీ తరువాయి)

పడుతోందని గ్రామ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వృద్ధుల ముఖంపై ముడతలు, కనురెప్పలు సరిగా స్కాన్ కాకపోవడం వల్ల ఈ సమస్యలు ఎదురవుతున్నాయి. కేవలం ఈ రెండు రోజుల్లో 75 వేల మంది లబ్ధిదారుల సర్వే పూర్తి చేయడం అసాధ్యమని గ్రామ కార్యదర్శులు వాపోతున్నారు.

## మొదటి రోజే మొరాయించిన యాప్!

(5వ పేజీ తరువాయి)

5 వేల మందికి పైగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. కొందరు ఉపాధ్యాయులు ఇతర వ్యాపకాలతో అనధికారికంగా విధులకు గైర్హాజరవుతున్నారనే విమర్శలు చాలా కాలంగా వినిపిస్తున్నాయి. దూర, మారుమూల గ్రామాల్లోని పాఠశాలలకు సకాలంలో రాకపోవడం, తరగతులు ముగియక ముందే వెళ్లిపోతున్నారనే ఆరోపణలు, తల్లిదండ్రుల నుంచి విద్యాశాఖ అధికారులకు ఇలాంటి ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ సమస్యలన్నింటికీ చెక్ పెట్టడానికి ప్రభుత్వం ఆన్‌లైన్ హాజరు విధానానికి శ్రీకారం చుట్టింది.

### పదోన్నతులు బాధ్యతను పెంచుతాయి



ఎస్‌ఐగా పదోన్నతి పొందిన ఉమేష్‌కు స్టార్ బ్యాడ్జీని అలంకరిస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): పదోన్నతులు పోలీసులకు మరింత బాధ్యతను పెంచుతాయని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి అనురాధ పేర్కొన్నారు. జిల్లాలో పని చేస్తూ ఏఎస్ఐ నుంచి ఎస్ఐగా ప్రమోషన్ పొందిన ఎన్. ఉమేష్, హెడ్ కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐగా ప్రమోషన్ పొందిన సదయ్యలను సీపీ అభినందించి, బ్యాడ్జీలను స్వయంగా అలంకరించారు. కాగా పదోన్నతులు పొందిన ఎస్ఐ, ఏఎస్ఐలు మర్యాదపూర్వకంగా సీపీకి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్బీసీఐ శ్రీధర్ గౌడ్, రాష్ట్ర పోలీసు సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### డ్రంకెన్ డ్రైవ్‌లో 51 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఇటీవల నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 51 మంది వాహనదారులు పట్టుబడ్డారు. వారిని శుక్రవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరచగా విచారణ అనంతరం రూ. 1,04,500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

### గజ్వేల్‌లో పేకాట రాయుళ్ల అరెస్ట్

గజ్వేల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నలుగురు పేకాట రాయుళ్లను సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు అరెస్ట్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని పాత నగరపంచాయతీ కార్యాలయం వద్ద గల ఓ ఇంట్లో గురువారం రాత్రి పేకాట ఆడుతున్నట్టు విశ్వసనీయ సమాచారంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, గజ్వేల్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాడుతున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకోగా, ఓ వ్యక్తి పరారైనట్టు తెలిపారు. వారి వద్ద నుంచి నాలుగు మొబైల్ ఫోన్లు, రూ.28,100ను స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ సీఐ రవికుమార్ చెప్పారు.

## ఆలయాల్లో ప్రత్యేక పూజల సందడి




హుస్నాబాద్: శ్రీవేంకటేశ్వర ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

హుస్నాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం మహిళలు ఘనంగా కుంకుమార్చన నిర్వహించారు. ఇందులో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వి మురళీధర్ స్వామి, డైరెక్టర్లు ఆర్ కవిత, ఎన్ విజయలక్ష్మి, అనంతస్వామి, శ్రీనివాస్ స్వామి, అశోక్ కుమార్, చంద్రశేఖర్, ప్రకాష్, చంద్రమౌళి తదితరులున్నారు.

- **కొండపాక:** మండలంలోని మర్పడగ శ్రీవిజయ దుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో శుక్రవారం రాహుకాల పూజ క్షేత్ర నిర్వాహకులు డాక్టర్ చెప్పెల హరినాథశర్మ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభం కాగా విజయదుర్గామాతకు విశేష పంచామృత ఫలరసాభిషేకం నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం సంతాన మల్లికార్జునస్వామి వారి అభిషేకం నిర్వహించారు. రాహుకేతు దోషనివారణ కోసం అష్టనాగపూజ నిర్వహించి కుజదోష నివారణకు సుబ్రహ్మణ్య స్వామి వారి అభిషేకం నిర్వహించారు. పల్లకీసేవ వైభవంగా సాగింది. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.



మర్పడగ క్షేత్రంలో భక్తుల పూజలు



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గామాత

### నేటి నుంచి సంతోషిమాత ఆలయ వార్షికోత్సవాలు

**సిద్దిపేట కల్చరల్:** జిల్లా కేంద్రంలోని పటేల్‌పురలోని శ్రీ సంతోషిమాత ఆలయ 43వ వార్షికోత్సవాలను ఈ నెల 2 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 5వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు, నిత్యపూజ, రుద్ర చండీ హవనం, సామూహిక కుంకుమార్చనలు, ప్రత్యేక భజన కార్యక్రమాలు జరుగనున్నాయి. చివరి రోజైన మంగళవారం రథోత్సవం నిర్వహించనున్నారు. కాగా శ్రావణ మాసంలో ప్రతిరోజూ సర్వదోష నివారణ హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు పొడిచేటి రామకృష్ణాచార్యులు తెలిపారు.

### ట్రాఫిక్ నియమాలను పాటించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సిద్దిపేట క్రైం ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ప్రతి ఒక్కరూ తప్పకుండా ట్రాఫిక్ నియమాలను పాటించాలని సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన రాజీవ్ రహదారి పొన్నాల వై జంక్షన్ వద్ద సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ విజయ్ భాస్కర్, ట్రాఫిక్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ చలాన్ పెండింగ్ ఉన్న 450 వాహనాలను గుర్తించారు. సదరు వాహనాల యజమానులుతో ఆన్‌లైన్ ద్వారా ఈ చాలన్ జరిమానాలను కట్టించారు. ట్రాఫిక్ ఏసీపీ మాట్లాడుతూ 3 కానీ అంతకంటే ఎక్కువ ఈ చాలన్ పెండింగ్ ఉన్న వాహనదారులు వారి ఫోన్ నెంబర్లకు మెసేజ్ వస్తుందని అది చూసుకొని వెంటనే ఆన్ లైన్ లో చెల్లించాలని సూచించారు.

### కళాశాలలో అడ్మిషన్‌ల సంఖ్య పెంచాలి

చిన్నకోడూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : కళాశాలలో అడ్మిషన్‌ల సంఖ్యను పెంచాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్ రెడ్డి సూచించారు. చిన్నకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. కళాశాలలో వసతులు, తరగతుల నిర్వహణ తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. క్రమం తప్పకుండా కళాశాలకు హాజరు కావాలని ఇష్టంతో చదివి నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. అధ్యాపకులతో సమావేశం నిర్వహించి అడ్మిషన్‌ల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. గతేడాది ఉత్తమ ఫలితాలు సాధించినందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తిచేయాలి

మిరుదొడ్డి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని జడ్పీ సీఈవో రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం మిరుదొడ్డి మండలం లక్ష్మీనగర్ గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మిరుదొడ్డి మండల పరిషత్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. వెంట ఎంపీడీవో గణేష్‌రెడ్డి, ఏపీవో సుభాష్, పంచాయతీ కార్యదర్శి ఉషారాణి తదితరులున్నారు.

### ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



భూంపల్లిలో జడ్పీహెచ్ఎస్‌లో టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు చేస్తున్న తిరుపతిరెడ్డి

మిరుదొడ్డి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె, భూంపల్లి, రుద్రారం, ఖాజీపూర్, జంగపల్లి, చిట్టాపూర్, ఎనగుర్తి, రామేశ్వరంపల్లి, పోతరెడ్డిపేట జడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలల్లో టీపీటీఎఫ్ సభ్యత్వనమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారంలో వచ్చి 19 నెలలు కావస్తున్న ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యలను పరిష్కరించడం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఉపాధ్యాయసంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 5న జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్న ధర్నాకు ఉపాధ్యాయులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరేందర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జానకిరాములు, ఉపాధ్యక్షుడు మల్లేశం, జిల్లా కార్యదర్శి శివాజీ, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి యాదగిరి, నాగరాజు, రాములు, రాజయ్య ఉన్నారు.

### సంక్షేమ పథకాల అమలు కోసం బీజేపీ ధర్నా



గుర్రాల సోఫా వద్ద రోడ్డుపై ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

రాయపోల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకం వెంటనే అమలు చేయాలని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని శుక్రవారం రాయపోల్ మండలం గుర్రాల సోఫా వద్ద గజ్వేల్ చేగుంట రహదారిపై బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మండల బీజేపీ అధ్యక్షుడు మంకిడి స్వామి మాట్లాడుతూ అర్హులైన యువకులకు యువ వికాస్ ద్వారా వెంటనే సబ్సిడీ లోన్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే అర్హులైన వారికి ఇళ్లను మంజూరు చేయకుంటే తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ సమాచారమందుకున్న తొగుట సీఐ లతీఫ్, రాయపోల్ ఎస్ఐ మానస అక్కడికి చేరుకొని ధర్నాను విరమింపజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రాజిరెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు రాజుగౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### తీరనున్న లింగరాజ్‌పల్లి దాహార్తి




లింగరాజ్‌పల్లి గ్రామస్థులకు దుబ్బాక ఎమ్మెల్యే అందజేసిన కొత్త బోరు పంపును ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

దౌల్తాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లింగరాజ్‌పల్లిలో మిషన్ భగీరథ నీళ్లు రాక గ్రామ పంచాయతీ బోరు మోటర్ కాలిపోయి గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యపై గత నెల 21న 'తాగునీటి కటకట' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాన్ని మాజీ జడ్పీటీసీ రణంజ్యోతి శ్రీనివాస్‌గౌడ్ దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి లింగరాజ్‌పల్లి గ్రామానికి కొత్త బోరు మోటర్‌ను అందించారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్‌లు కేత కనకరాజు, పోతరాజ్ ప్రకాశ్, గ్రామస్థులు మాట్లాడుతూ.. సమస్యను వెలుగులోకి తెచ్చిన ఆంధ్రజ్యోతికి, సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డితో పాటు ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

### జీవో నెం 99 ఉపసంహరించుకోవాలి

చేర్యాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జీవో నెం 99ను ఉపసహరించుకోవాలని డిమాండ్ చేస్తూ జాతీయ మాలమహానాడు నాయకులు శుక్రవారం చేర్యాలలో నల్లబ్యాడ్జీలు ధరించి స్థానిక అంబేడ్కర్ విగ్రహావరణలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జాతీయ మాలమహానాడు రాష్ట్రప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ పట్ల సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా సామాజిక విద్రోహదినాన్ని పాటిస్తున్నామన్నారు. ఎస్సీ-3 కేటగిరీ రోస్టర్ పాయింట్స్ తగ్గించాలని ఏకపక్ష తీర్మానం చేసి మాలల ఉనికి లేకుండా చేసే కుట్రలను పునరాలోచించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద శ్రీకాంత్, పుట్ట యాదయ్య, శ్రీరాం వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

### ఎన్నికల హామీలు మరిచిన కాంగ్రెస్ ప్రభుత్వం

ములుగు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో దివ్యాంగులకు పెన్షన్‌ను పెంచుతామంటూ ఇచ్చిన పలు హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బుడిగె మహేష్ మాదిగ విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రమైన ములుగులో దివ్యాంగులు, వృద్ధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 3వ తేదీన గజ్వేల్‌లో దివ్యాంగులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.